రోడ్డు పనులు పూర్తి చేయాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆంజనేయులు

నిజాంపేట్: బాచుపల్లి–మల్లంపేట్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని మల్లంపేట్‌కు చెందిన ఆంజనేయులు సోమవారం నిజాంపేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లంపేట్ రోడ్డు తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని, అంబులెన్స్ బాచుపల్లికి వెళ్లాలంటే రెండు గంటలు పడుతోందన్నారు. ప్రణీత్ ఆంటీల గేటు తీయాలని ఫిర్యాదు చేస్తే.. పక్కనే ఉన్న ఓ ప్రైవేట్ వ్యక్తికి అప్రోచ్‌రోడ్డు ఇచ్చారని, మల్లంపేట్ గ్రామస్తులకు మాత్రం ఇవ్వడం లేదన్నారు. ప్రణీత్ ఆంటీల నుంచి వచ్చే మురుగునీటితో మల్లంపేట్ చెరువు దుర్గంధంగా మారిందన్నారు. అధికారులు స్పందించి మల్లంపేట్ వాసులు రాకపోకలు సాగించే వీలుగా రోడ్డు సదుపాయం కల్పించడంతో పాటు మల్లంపేట్ చెరువులో దుర్గంధం చేరకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

మానసాదేవి హోమంలో సినీహీరో సుమన్


మానసాదేవి హోమంలో పాల్గొన్న సినీ హీరో సుమన్, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్‌లోని పట్టాభి రామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణములోని గౌరీ శంకర స్వామి ఆలయంలో సోమవారం మానసాదేవి హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సినీ హీరో సుమన్, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ ధనరాజ్‌యాదవ్, అరవింద్, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, రాములు, రవీందర్, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై ఫిర్యాదు


జలమండలి జీఎంకు ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. రావినారాయణరెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాతాల గోపాల్ ఆధ్వర్యంలో జీఎంకు ఫిర్యాదు చేశారు. కాలనీలో పదిరోజులకోసారి నీటి సరఫరా అవుతుండటంతో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని కోరారు. దీనిపై స్పందించిన జీఎం తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆర్గనైజర్ హనుమాన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

నిజాంపేట్: నిజాంపేట్‌కు చెందిన ఏనుగుల శ్రీకాంత్‌రెడ్డి గురుస్వామి నివాసంలో సోమవారం జరిగిన అయ్యప్ప అభిషేక పడిపూజ కార్యక్రమానికి గజానంద్ జోషి, వెంకటరెడ్డి స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. భజనలు, అయ్యప్ప గీతాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికతను సంతరించుకుంది. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డి స్వామి, రామాలయం చైర్మన్ కొలన్ శ్రీనివాస రెడ్డిస్వామి, అభయాంజనేయ ఆలయ చైర్మన్ ధనరాజ్‌యాదవ్‌స్వామి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.


మహా పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలాధారులు

వైభవంగా ఉమామహేశ్వర కల్యాణం


ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరుడు


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్: సూరారంలోని ఉమా మహేశ్వరాలయంలో ఆఖరి సోమవారం సందర్భంగా ఉమామహేశ్వర కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ మహోత్సవానికి హంపీ పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వామీజీ, రేరా చైర్మన్ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’కి 7 ఫిర్యాదులు

చింతల్ : కుత్బుల్లాపూర్ వాటర్ పుష్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సోమవారం ఏడు ఫిర్యాదులు వచ్చాయి. జీఎం అశోక్ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ఎక్కువగా నీటి కటకట గురించి ఫిర్యాదులు వచ్చాయి. మధుసూదన్ రెడ్డి నగర్, రావి నారాయణరెడ్డి నగర్, మల్లారెడ్డి నగర్, కైలాష్ హిల్స్, సూరారం సెక్షన్ నుంచి రాజుల స్వామి నగర్, జి సుధాకర్, జీడిమెట్ల సెక్షన్ నుంచి మరో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీజీఎంలు, సెక్షన్ మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి వస్తేనే చెక్కులు ఇస్తరా?

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో జాప్యమెందుకు?
- మంగళవారం ఉదయం 11లోగా ఇవ్వకుంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమయం ఇవ్వడం లేదంటూ అధికారులు కాలయాపన చేయటం సిగ్గు చేటని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 534 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరై తహసీల్దార్ కార్యాలయాలకు చేరి నెల గడుస్తున్నా అందజేయక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులమతాలు, ప్రాంతీయత, రాజకీయాలకు తావు లేకుండా గడిచిన పదేళ్లలో ప్రభుత్వ పథకాలను అందరికీ అందించామని గుర్తు చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను గతంలో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా లబ్ధిదారులకు భోజనాలు పెట్టి పండుగ వాతావరణంలో పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల చెక్కులు అందిస్తే, ఈ ప్రభుత్వం తులం బంగారం అదనంగా ఇసామని హామీ ఇచ్చిందన్నారు. తులం బంగారం ఇవ్వకపోగా.. సిద్ధంగా ఉన్నా చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వకుండా రాజకీయాలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పేదలకు మేలు చేకూర్చడమే ధ్యేయం అయినప్పుడు ఎవరు పంపిణీ చేస్తే ఏముందన్నారు. ఆన్‌లైన్‌లో ఎమ్మెల్యే వద్ద చెక్కులు పెండింగ్‌లో ఉన్నట్లు చూపడంతో ప్రతి రోజూ అనేక మంది కార్యాలయానికి వచ్చి అడిగి వెళ్తున్నారని తెలిపారు. నియోజకవర్గాల్లో ప్రభుత్వ పథకాల పంపిణీ ఎమ్మెల్యే ద్వారా చేపట్టాలని హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం రాజకీయాలకు చోటు కల్పించటం బాధాకరమన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు చెక్కులను పంపిణీ చేయకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలు తగవు

కూకట్‌పల్లి: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో బ్లాక్ మెయిల్ రాజకీయాలు తగవని కాంగ్రెస్ ఏ బ్లాక్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎం. యుగంధర్ రెడ్డి అన్నారు. అధికారులు చెక్కులను పంపిణీ చేసే వరకు ఎమ్మెల్యే ఆగకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. చెక్కులు అందించడంలో అధికారులు అన్నీ సరి చేసుకొని పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాలను పేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

నిర్వహణ లేక నిరుపయోగంగా!


గిరినగర్ ప్రధాన రోడ్డులో హ్యాండిల్ లేకుండా ఉన్న చేతి పంపు

- తుప్పపట్టిన చేతి పంపులు, పవర్ బోర్లు
- పట్టించుకోని అధికారులు


సంజయ్‌గాంధీనగర్‌లో వృథాగా ఉన్న ట్యాంక్


చెన్నారెడ్డినగర్‌లో భూమిలోకి కూరుకుపోయిన చేతి పంపు

రంగారెడ్డినగర్: అత్యవసర సమయంలో ప్రజలకు నీటి అవసరాలు తీర్చే చేతి పంపులు, పవర్ బోర్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. చాలా ప్రాంతాల్లో చేతి పంపుల్లో సరిపడా నీళ్లు ఉన్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో వృథాగా మారాయి. బోరు వేయడంతో పాటు దానికి విద్యుత్ కనెక్షన్, మోటారు, స్టాటిక్ ట్యాంక్ ఏర్పాటు చేసేందుకు వెచ్చించిన లక్షలాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్‌గాంధీ నగర్‌లోని మండల పరిషత్ పాఠశాల ఎదురుగా, పంచశీల కాలనీ, రంగారెడ్డి నగర్, వెంకట్రామిరెడ్డినగర్, చెన్నారెడ్డినగర్‌లలో పదుల సంఖ్యలో స్టాటిక్ ట్యాంక్‌లు వృథాగా మారాయి. గిరినగర్ ప్రధాన రోడ్డు, గాంధీనగర్ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్, గాంధీ నగర్ వార్డు కార్యాలయం సమీపంలోని రోడ్డుకు ఇరువైపులా, రంగారెడ్డినగర్‌కు వెళ్లే రోడ్డులో, షాపూర్‌నగర్ మార్కెట్ సమీపంలోని పలు వీధుల్లో, గురుమూర్తినగర్ ప్రధాన రోడ్డు మార్గాల్లో చేతి పంపులు భూమిలోకి కూరుకుపోవడం, చేతి పంపు హ్యాండిల్స్, చెయిన్‌లను స్క్రాప్ సేకరించే వ్యక్తులు మాయం చేయడంతో నిరుపయోగంగా మారాయి.


గురుమూర్తినగర్‌లో వృథాగా ఉన్న చేతి పంపు


షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో హ్యాండిల్ లేకుండా..


ఓం జెండా రోడ్డులో నిరుపయోగంగా ఉన్న స్టాటిక్ ట్యాంక్


గాంధీనగర్‌లో జడ్పీ హెచ్‌ఎస్ స్కూల్ పక్క గల్లీలో ..

అయ్యప్ప స్వాములకు భిక్ష



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలోని శ్రీబాలా శాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచశీల కాలనీ రెసిడెన్షియల్ ఇండస్ట్రియల్ సౌజన్యంతో స్వాములకు భిక్ష నిర్వహించారు. డిసెంబర్ 26 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు స్వాములకు భిక్ష ఉంటుందని, పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలాధారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఓయూకు గ్రూప్-4 ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్–4కు ఎంపికైన ఉద్యోగులలో 375 మంది ఓయూకు రానున్నారు. యూనివర్సిటీ చరిత్రలో నాన్‌టీచింగ్ ఉ ద్యోగులను తొలిసారి గ్రూప్–4 ఎంపికైన ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు. ఇది వరకు నాన్‌టీచింగ్ ఉద్యోగాలను ఓయూ అధికారులు నియమించారు. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాల నిబంధనలు మార్చింది. దీంతో గత 26 సంవత్సరాలుగా ఓయూలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులు నిరాశ చెందుతున్నారు. గ్రూప్–4 ఉద్యోగుల రాకతో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తారేమోనన్న గుబులు కాంట్రాక్టు ఉద్యోగుల్లో కొత్తగా మొదలైంది. వీసీ ప్రొ.కుమార్ ఓయూ కాంట్రాక్టు ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కోరుతున్నారు.

నేడు మేడ్చల్‌కు మంత్రుల రాక

మేడ్చల్‌రూరల్: మేడ్చల్‌కు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుదిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మంగళవారం విచ్చేస్తున్నట్లు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని మేడ్చల్ మార్కెట్ కమిటీ నూతన భవనం ప్రారంభోత్సవంతో పాటు.. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్సింహులు యాదవ్, మేడ్చల్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకరణ మహోత్సవంలో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

ప్రొటోకాల్ పాటించకపోతే కఠిన చర్యలు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి



మేడ్చల్: మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాలలో నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని, పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసే బ్యానర్లు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలలో ఎక్కడా నాయకులకు విలువ ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించడం లేదని, అలాంటి వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

భూగర్భ డ్రైనేజీ నుంచి రసాయనాలు


ఎరుపురంగులో రోడ్డుపై పారుతున్న రసాయనాలు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ లాస్ట్‌బస్టాప్ రోడ్డులోని సుభాష్‌నగర్‌లో సోమవారం రాత్రి ఒక్కసారిగా భూగర్భ డ్రైనేజీ నుంచి ఎరుపురంగులో రసాయనాలు ఉబికి పైకి వచ్చాయి. దీంతో కాలనీ వాసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. పూర్తిగా రసాయనాలు ఎరుపురంగులో ఉండి విపరీతమైన దుర్వాసన వెలువడిందని కాలనీవాసులు పేర్కొన్నారు. స్థానికంగా కొంతమంది రీసైక్లింగ్ పరిశ్రమలను నిర్వహిస్తూ రసాయనాల డ్రమ్ములను కడిగి నాలాల్లో పారబోయడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు పీసీబీ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని అనుమతులు లేకుండా కాలనీలో ఇళ్లమధ్యలో నడుస్తున్న పరిశ్రమలను మూసివేయించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

జీపీ కార్మికులకు జీతాలు చెల్లించాలి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో లక్ష్మాపూర్, కేశవపురం గ్రామ పంచాయతీలో 4 నెలలు, పొన్నాల, కేశవరం, నూతనకల్, లింగాపూర్, గ్రామ పంచాయతీలో 3 నెలలు జీతాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో బతుకుతున్న గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం మూడు, నాలుగు నెలలు జీతాలు పెండింగ్‌లో పెడితే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కార్మికులకు జీతాలు పెంచుతామని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడుస్తున్నప్పటికీ పట్టించుకోకపోవటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల పురపాలక సంఘాల్లో విలీనం చేసిన జీపీ కార్మికులకు కూడా జీతాలు ఇవ్వటం లేదన్నారు. వీరిని మున్సిపల్ కార్మికులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్ఓ హరిప్రియకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఉన్ని కృష్ణ, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకురాలు రాములమ్మ, జీపీ కార్మికులు పాల్గొన్నారు .

దివ్యాంగుల హామీలు అమలు చేయాలి



సాక్షి,సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలకు పెన్షన్ పెంచి వెంటనే అమలు చేయాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్ పెంచేందుకు డబ్బులు లేవని చెప్పూనే మరోవైపు కమీషన్లు వచ్చే ప్రాజెక్టులకు లక్షల కోట్లు ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెన్షన్ పెంపు కోసం 44 లక్షల మంది ఆసరా లబ్ధిదారులు, కొత్త పెన్షన్ మంజూరు కోసం 24.85 లక్షల మంది అర్హులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగిస్తూ గత ప్రభుత్వం జీవో 34 ఇచ్చిందని, దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగ దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ అమలు చేయడానికి అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ గౌతమ్, డీఆర్ఓ హరిప్రియకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా నాయకులు చంద్రమోహన్, మల్లేష్, బాలయ్య, శివ, గంగారెడ్డి, చంద్రయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: వివిధ సమస్యలపై ప్రజలు అందించిన 67 ఫిర్యాదులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ స్వీకరించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, చెరువులు, కుంటల పరిరక్షణపై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు రాత పూర్వకంగా వినతులను సమర్పించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాయం వంటి పథకాల కోసం ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలపై ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు క్యాంటీన్ సౌకర్యం కల్పించాలి

జగద్గిరిగుట్ట: ఎస్‌సీటీపీ ప్లాంట్ వద్ద మౌలిక వసతులు, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌సీటీపీ ప్లాంట్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. చెత్త సేకరణ ఆటో కార్మికులు, డంపింగ్ యార్డ్‌లో పనిచేసే వారు మొత్తం దాదాపు 400 మంది వరకు ఉంటారన్నారు. ఉదయం ఐదు గంటలకు బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిరుపేద కార్మికులు ట్రాలీలో చెత్త సేకరిస్తారని, వీరికి అల్పాహారం, భోజనం చేయడానికి సరైన సమయం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఎం జనార్దన్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లి సాయినాథ్ సొసైటీలోని సర్వే నెంబర్ 227లో సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అవినాష్ నేతృత్వంలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన షెడ్డు కంటైనర్లను తమ సిబ్బందితో కలిసి కూల్చి వేశారు. సర్వే నంబర్ 227లో నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని, ఆ స్థల వివాదం కోర్టు పరిధిలో ఉందని తెలిపారు.

‘ప్రజావాణి’లో ఫిర్యాదుల స్వీకరణ


ప్రజావాణిలో పాల్గొన్న ఉప కమిషనర్ నరసింహ, అధికారులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపేందుకు ప్రజావాణి దోహద పడుతోందని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అన్నారు. సోమవారం గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుండి మంచి స్పందన లభించింది. గాజులరామారం సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్(01), ఇంజినీరింగ్ (04) మొత్తం 5 ఫిర్యాదులు, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ (01), టాక్స్‌సెక్షన్ (01) మొత్తం 2 ఫిర్యాదులు అందాయి. సత్వరమే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఉప కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులకు చేతిరాతపై ఉచిత శిక్షణ


చేతిరాతపై శిక్షణ ఇస్తున్న చేతిరాత నిపుణుడు మల్లయ్య

రంగారెడ్డినగర్: అందమైన చేతిరాత మంచి మార్కులను సాధించటానికి ఉపయోగ పడుతుందని గిరినగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చంద్రయ్య అన్నారు. సోమవారం చేతిరాత నిపుణుడు వంపు మల్లయ్య ఆధ్వర్యంలో పాఠశాలలో ఉచిత లూసిడా హ్యాండ్ రైటింగ్ శిక్షణను ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో విద్యార్థులు మొదటి రోజు ఉత్సాహంగా పాల్గొని చేతిరాతపై అవగాహన పెంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేంద్ర రెడ్డి, అనిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



దుండిగల్: బౌరంపేట గ్రామంలో నిర్మిస్తున్న ప్రధాన రోడ్డు పనులను సోమవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. కొన్ని సంవత్సరాల నుంచి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని నాయకులు గుర్తు చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన వల్లే అధికారులు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో పీసరి కృష్ణారెడ్డి, సత్యనారాయణ, చింత మల్లేష్, పీసరి శేఖర్ రెడ్డి, శ్రీకాంత్, సంజీవరెడ్డి, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.